# సాక్షి ఖమ్మం

ఆదివారం । 3 । డిసెంబర్ । 2023




**యాసంగి విత్తనాలు రెడీ**

యాసంగిలో ఉమ్మడి జిల్లా రైతులు సాగు చేసే పంటలకు కావాల్సిన విత్తనాలను విత్తనాభివృద్ధి సంస్థ సిద్ధం చేసింది.

10లో



**మళ్లీ గెలిచేది బీఆర్‌ఎస్సే..**

రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్ గెలవడం, కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయమని పార్టీ ఖమ్మం అభ్యర్థి పువ్వాడ అజయ్ తెలిపారు.

8లో

గరిష్ఠం / కనిష్ఠం 32° / 24°

**వాతావరణం**

ఆదివారం జిల్లా అంతటా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం తర్వాత చలిగాలుల తీవ్రత పెరుగుతుంది.

## పోస్టల్ బ్యాలెట్లు... 14,373

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: జిల్లావ్యాప్తంగా ఐదు నియోజకవర్గాల్లో 14,373 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదయ్యాయి. ఇందులో 150 మంది ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని.. బ్యాలెట్లు పంపించారు. ఇక వయోవృద్ధులు, దివ్యాంగులు 2,292 మంది ఇంటి వద్ద ఓటు వేశారు. అలాగే, ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులు 11,931 మంది కూడా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు. కాగా, పోస్టల్ బ్యాలెట్ల ఓట్లు లెక్కించేందుకు కౌంటింగ్ కేంద్రంలో 12 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఇందులో ఖమ్మం నియోజకవర్గానికి నాలుగు టేబుళ్లు, మిగిలిన నియోజకవర్గాలకు రెండు చొప్పున టేబుళ్లు కేటాయించారు. ఆదివారం ఉదయం 8 గంటలకు ఈ ఓట్లు లెక్కించాక... ఈవీఎంల్లో ఓట్ల లెక్కింపు మొదలుపెట్టనున్నారు.

**నియోజకవర్గాలవారీగా పోస్టల్ బ్యాలెట్లు**

| నియోజకవర్గం | బ్యాలెట్లు |
|---|---|
| ఖమ్మం | 5,567 |
| పాలేరు | 2,163 |
| మధిర | 1,790 |
| వైరా | 2,074 |
| సత్తుపల్లి | 2,779 |
| మొత్తం | 14,373 |

## అంతా సన్నద్ధం..




వైరా నియోజకవర్గ స్ట్రాంగ్ రూం వద్ద సాయుధ బలగాల పహారా

కౌంటింగ్ ప్రక్రియకు పూర్తిస్థాయిలో అధికారులు సిద్ధమయ్యారు. పొన్నేకల్‌లోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాల హాల్‌లో ఓట్ల లెక్కింపునకు కావాల్సి న ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఇక్కడే జరగనుండదంతో... ఏ నియోజకవర్గం ఓట్లు ఎక్కడ లెక్కిస్తారో తెలిసేలా బోర్డులు ఏర్పాటుచేశారు. అలాగే, ఉద్యోగులు తప్ప ఇతరులెవరూ రాకుండా ఇనుప కంచెలు బిగించారు. ఇక స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ఇద్దరేసి చొప్పున సాయుధ పోలీసులు పహారా కాస్తున్నారు.




హాల్ లోపలకు ఇతరులు రాకుండా బిగించిన కంచె

# టిక్.. టిక్.. టిక్



**విజేతలు ఎవరు ?!**

- మరికొద్ది గంటల్లో వెల్లడి కానున్న ఎన్నికల ఫలితాలు
- నేటి ఉదయం 8గంటలకు కౌంటింగ్ మొదలు
- తొలుత వైరా.. చివరకు ఖమ్మం ఫలితం
- అంతా సిద్ధం చేసిన అధికారులు
- కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, సీపీ



కౌంటింగ్ హాల్‌లో సిద్ధం చేసిన టేబుళ్లు, కుర్చీలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల జాతకం మరికొద్ది గంటల్లో తేలిపోనుంది. విజేతలు ఎవరు... పరాజితులు ఎవరనే టెన్షన్ అభ్యర్థులను వెంటాడుతోంది. బూత్‌ల వారీగా విశ్లేషణలు చేసుకుని ఎవరికి వారు గెలుపుపై ధీమాగా ఉన్నా.. మరోవైపు ఆందోళన కూడా ఉంది. ఖమ్మంరూరల్ మండలం పొన్నేకల్‌లోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ఓట్ల లెక్కింపు జరగనుండగా.. యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. కేంద్రంలో ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్ శనివారం పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కేంద్రంతోపాటు ఈవీఎంలు, కంట్రోల్ యూనిట్లను భద్రపరచిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 8గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుండగా.. తొలుత పోస్టల్, సర్వీస్ ఓట్లు లెక్కిస్తారు. అనంతరం 8.30 గంటల నుంచి ఈవీఎంల్లో నమోదైన ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. కాగా, జిల్లావ్యాప్తంగా 12,16,796 మందికి గాను 10,20,087 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందుకోసం 1,456 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసిన విషయం విదితమే.

**8 గంటలకు మొదలు**

ఉదయం 8గంటలకు పోస్టల్, సర్వీస్ ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. 8.30గంటల వరకు ఈ ప్రక్రియ పూర్తయినా, కాకున్నా పోలింగ్ కేంద్రాల వారీగా ఈవీఎంలు ఓపెన్ చేస్తారు. ఒక్కో టేబుల్ వద్ద మైక్రో అబ్జర్వర్, కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్‌ను నియమించారు. 210 మంది చొప్పున మొత్తం 630 మంది విధులు నిర్వహిస్తారు. అలాగే, మరో 20 శాతం మంది రిజర్వ్‌గా నియమించారు. ఖమ్మం నియోజకవర్గానికి ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉండటంతో 16 టేబుళ్లు ఏర్పాటు చేయగా.. ఈ నియోజకవర్గ ఫలితం 23 రౌండ్లలో తేలుతుంది. మిగతా నియోజకవర్గాలు ఒక్కోదానికి 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. మధిర 20 రౌండ్లలో, సత్తుపల్లి, పాలేరు 21 రౌండ్లలో, వైరా ఫలితం 18 రౌండ్లలో వెలువడనుంది. అంటే జిల్లాలో తొలుత వైరా నియోజకవర్గ విజేత ఎవరో వెల్లడి కానుండగా.. చివరగా ఖమ్మం విజేతను ప్రకటిస్తారు.

**అభ్యర్థుల్లో ఉత్కంఠ**

జిల్లాలో ఐదు నియోజకవర్గాల్లో అన్ని పార్టీల నుంచి 119 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరంతా కౌంటింగ్ ప్రక్రియకు సిద్ధమయ్యారు. కౌంటింగ్ కేంద్రం వద్ద అనుసరించాల్సి వ్యూహాలపై అనుచరులతో చర్చించారు. చురుకైన కార్యకర్తలను పోలింగ్ ఏజెంట్లుగా నియమించేశారు. ఇప్పటి వరకు పోలింగ్ సరళిపై పూర్తిస్థాయిలో విశ్లేషణ చేసిన అభ్యర్థులు తుదితీర్పు కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఏ పోలింగ్ కేంద్రంలో ఎక్కువ ఓట్లు వచ్చే అవకాశం ఉందనే అంశాలను పూర్తిగా చర్చించి.. ఆ మేరకు నిశితంగా పరిశీలించాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది.

## ఒక్కో రౌండ్ ఫలితానికి అర గంట

- ఖమ్మంకు టేబుళ్లు పెంచేలా అనుమతి కోరాం
- కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన సీపీ

ఖమ్మం సహకారనగర్: అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు పొన్నెకల్లులోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం జరగనుండగా.. పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలో పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్‌తో కలిసి శనివారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఒక్కో నియోజకవర్గానికి 14 టేబుళ్లు ఏర్పాటుచేయగా, ఖమ్మం నియోజకవర్గంలో అత్యధికంగా 355 పోలింగ్ బూత్‌లు ఉన్న నేపథ్యాన అదనంగా రెండు టేబుళ్ల ఏర్పాటుకు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి కోరామని చెప్పారు. ఖమ్మం నియోజకవర్గానికి 25 రౌండ్లు ఉండగా... రెండు టేబుళ్లు పెరిగితే 23 రౌండ్లకు తగ్గుతుందని తెలిపారు. ఒక్కో రౌండ్ ఫలితం వెల్లడయ్యేందుకు సుమారు అరగంట సమయం పడుతుందని కలెక్టర్ వెల్లడించారు.

**ఐదుగురు అబ్జర్వర్లు**

జిల్లాకు ముగ్గురు జనరల్ అబ్జర్వర్లను ఎన్నికల సంఘం కేటాయించగా, కౌంటింగ్ సమయంలో మరో ఇద్దరిని అదనంగా నియమించిందని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఐదుగురు ఐదు నియోజకవర్గాల్లో ర్యాండమ్‌గా రెండు చొప్పున సీయూ(కంట్రోల్ యూనిట్లు)ను ఎంపిక చేసి ఓట్లు లెక్కిస్తారని.. అనంతరం ఐదు వీవీ ప్యాట్ల స్లిప్పులు లెక్కించి, కంట్రోల్ యూనిట్‌లో నమోదైన ఓట్లతో సరిపోలుస్తారని చెప్పారు. కాగా, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, ప్రాంగణంలోని బ్లాక్‌లో 80నుంచి 90మంది సిబ్బంది, ఆపై సాయుధ బలగాల పహారా ఉంటుందని చెప్పారు. మూడో దశగా కేంద్రం చుట్టూ సివిల్ పోలీసులు ఉంటారని తెలిపారు.

**144 సెక్షన్ అమలు**

జిల్లా అంతటా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని సీపీ విష్ణు ఎస్.వారియర్ వెల్లడించారు. ఎక్కడ కూడా విజయోత్సవ ర్యాలీలు నిర్వహించేందుకు అనుమతి ఉండదన్నారు. అలాగే, 42 సమస్యాత్మక గ్రామాల్లో పికెటింగ్ ఏర్పాటుచేశామని తెలిపారు.


### లెక్కింపు ఇలా..

| అభ్యర్థులు | పీఎస్‌లు | రౌండ్లు |
|---|---|---|
| 32 | 355 | 23 |




ఖమ్మం నియోజకవర్గంలో మొత్తం 3,22,996 మంది ఓటర్లు ఉండగా.. 2,30,724 మంది ఓటు వేశారు. తద్వారా 71.43 శాతం పోలింగ్ నమోదైంది. ఈ నియోజకవర్గంలో తొలుత పాపటపల్లి పోలింగ్ స్టేషన్ ఈవీఎంలో నమోదైన ఓట్లు లెక్కిస్తారు. ఆ తర్వాత రఘునాథపాలెం మండలంలోని వీ.ఆర్.బంజర, జీ.కే.బంజర, చిమ్మపుడి పోలింగ్ స్టేషన్ల వారీగా లెక్కిస్తూ చివరకు 48వ పోలింగ్ కేంద్రం రేగులచెలక వరకు ముగిస్తారు. అనంతరం కార్పొరేషన్ పరిధిలో పాండురంగాపురం 49వ పోలింగ్ కేంద్రం నుంచి లెక్కింపు ఉంటుంది. ఇక్కడి నుంచి బల్లేపల్లి, ఖానాపురం హవేలి, ప్రశాంతినగర్ కేంద్రాల్లో ఓట్లు లెక్కింపు తర్వాత.. రఘునాథపాలెం మండలంలోని వేపకుంట్ల, వి.వెంకటాయపాలెం వరకు ఓట్లు లెక్కిస్తారు. ఆ తర్వాత ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని ఖానాపురం, విజయనగర్, ఖమ్మం మున్సిపాలిటీ, రమణగుట్ట, బుర్హాన్‌పురం, కొత్తగూడెం, అల్లిపురం పోలింగ్ స్టేషన్ కంట్రోల్ యూనిట్ల లెక్కింపుతో ఖమ్మం నియోజకవర్గ కౌంటింగ్ ముగియనుంది.

| అభ్యర్థులు | పీఎస్‌లు | రౌండ్లు |
|---|---|---|
| 37 | 289 | 21 |




పాలేరు నియోజకవర్గంలో మొత్తం 2,36,287 మంది ఓటర్లు ఉండగా.. 2,14,810 మంది ఓటు వేశారు. ఇక్కడ 90.91 శాతం పోలింగ్ జరిగింది. ఈ నియోజకవర్గం లెక్కింపును తిరుమలాయపాలెం మండలం ముజాహిద్‌పురంతో ప్రారంభిస్తారు. 64వ నంబర్ పోలింగ్ కేంద్రం లెక్కింపుతో ఈ మండలం పూర్తవుతుంది. ఆ తర్వాత ఖమ్మం రూరల్ మండలానికి సంబంధించి 65వ పోలింగ్ కేంద్రం తనగంపాడు నుంచి 163వ పోలింగ్‌కేంద్రం కొండాపురం వరకు సాగుతుంది. ఇక కూసుమంచి మండలంలో 164వ పోలింగ్ కేంద్రం చేగొమ్మ నుంచి 230వ పోలింగ్ కేంద్రం జక్కేపల్లి వరకు ఉంటుంది. అలాగే, నేలకొండపల్లి మండలానికి సంబంధించి చెన్నారంలోని 231 పోలింగ్‌కేంద్రం నుంచి 289లోని కొంగర పోలింగ్ కేంద్రం ఓట్లు లెక్కించడంతో ఈ నియోజకవర్గ లెక్కింపు పూర్తవుతుంది.

| అభ్యర్థులు | పీఎస్‌లు | రౌండ్లు |
|---|---|---|
| 15 | 268 | 20 |




మధిర నియోజకవర్గంలో 2,21,326 మంది ఓటర్లకుగాను 1,94,615 మంది(87.83) ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ముదిగొండ మండలం మాదాపురం గ్రామం నుంచి ప్రారంభమవుతుంది. ఈ మండలం పరిధిలో 55వ పోలింగ్ స్టేషన్ పెదమండవ పోలింగ్ కేంద్రం వరకు లెక్కిస్తారు. ఆ తర్వాత చింతకాని మండలంలో 56వ పోలింగ్ స్టేషన్ చిన్నమండవ నుంచి లెక్కింపు ప్రారంభమై సీతంపేట 104 పోలింగ్ స్టేషన్ లెక్కింపుతో పూర్తవుతుంది. అనంతరం బోనకల్ మండలం ముష్టికుంట్లలోని 105 పోలింగ్ కేంద్రం నుంచి ప్రారంభమై.. రాపల్లిలోని 144 పోలింగ్ కేంద్రం వరకు లెక్కిస్తారు. ఆతర్వాత మధిర మండలంలో రొంపిమళ్ల 145వ పోలింగ్ కేంద్రం నుంచి ప్రారంభమై.. సిద్ధిన్నిగూడెంలోని 214 పోలింగ్ కేంద్రం వరకు ఉంటుంది. చివరగా ఎర్రుపాలెం మండలంలోని రామన్నపాలెం 215 పోలింగ్ కేంద్రం నుంచి రామాపురం 268వ పోలింగ్ కేంద్రం వరకు లెక్కింపుతో ముగుస్తుంది.

| అభ్యర్థులు | పీఎస్‌లు | రౌండ్లు |
|---|---|---|
| 12 | 252 | 18 |




వైరా నియోజకవర్గంలో మొత్తం 1,93,069 మంది ఓటర్లు ఉండగా.. 1,67,389మంది (86.70శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక్కడ కారేపల్లి మండలంలోని కొత్త కమలాపురంలోని ఒకటో పోలింగ్ స్టేషన్ నుంచి లెక్కింపు ప్రారంభమవుతుంది. పట్టిమీదిగుంపు గ్రామంలోని 61వ పోలింగ్‌స్టేషన్ ఓట్ల వరకు లెక్కిస్తారు. ఆ తర్వాత జూలూరుపాడు మండలం పాపకొల్లులోని 62వ పోలింగ్ స్టేషన్ నుంచి కోయకాలనీలోని 97వ పోలింగ్ స్టేషన్ వరకు కౌంటింగ్ చేస్తారు. ఆ తర్వాత ఏన్కూరు మండలంలోని భగవాన్ నాయక్‌తండాలోని 98వ పోలింగ్ స్టేషన్ నుంచి నూకాలంపాడు 134 పోలింగ్ కేంద్రం వరకు.. అనంతరం కొణిజర్ల మండలం గుబ్బగుర్తిలోని 135వ పోలింగ్ కేంద్రం నుంచి కొండవనమాల 194వ పోలింగ్ కేంద్రం వరకు లెక్కిస్తారు. ఆ తర్వాత వైరా మండలంలోని బ్రాహ్మణపల్లి 195వ పోలింగ్ కేంద్రం నుంచి గన్నవరం 252వ పోలింగ్ కేంద్రం వరకు ఓట్ల లెక్కింపుతో వైరా నియోజకవర్గ ఫలితం వెల్లడవుతుంది.

| అభ్యర్థులు | పీఎస్‌లు | రౌండ్లు |
|---|---|---|
| 23 | 292 | 21 |




సత్తుపల్లి నియోజకవర్గంలో 2,43,118 ఓటర్లు ఉండగా.. 2,12,549 ఓట్లు పోలయ్యాయి. ఇక్కడ 87.43 శాతం పోలింగ్ జరిగింది. ఈ నియోజకవర్గంలోని తల్లాడ మండలం మల్లారంలో ఒకటో నెంబర్ పోలింగ్ కేంద్రం నుంచి 57వ నంబర్ కేంద్రం వరకు లెక్కింపు ఉంటుంది. ఆ తర్వాత కల్లూరు మండలంలోని 58వ నంబర్ పోలింగ్ కేంద్రం నుంచి 120వ నంబర్ పోలింగ్ కేంద్రం వరకు, పెనుబల్లి మండలంలో 121వ పోలింగ్ కేంద్రం నుంచి 170వ నంబర్ వరకు, సత్తుపల్లి మండలంలో 171 నుంచి 245 వరకు, వేంసూరు మండలంలో 246 నుంచి 292వ పోలింగ్ స్టేషన్ వరకు భరణిపాడు లెక్కింపుతో పూర్తవుతుంది.



పోస్టల్ బ్యాలెట్లు వేసేందుకు సిద్ధం చేసిన అరలు

## న్యూస్‌రీల్

### జమలాపురంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలోని శ్రీవారి పాదంతోపాటు స్వామి మూలవిరాట్‌కు అర్చకులు పంచామృతాలతో అభిషేకం చేశారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నిత్య కల్యాణం జరిపించగా తెలంగాణ, ఏపీలోని వివిధ ప్రాంతాల భక్తులు దర్శించుకున్నారు. అనంతరం అర్చకులు పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

### రేపటి నుంచి నర్సింగ్ విద్యార్థులకు పరీక్షలు

ఖమ్మం వైద్యవిభాగం: జనరల్ నర్సింగ్ మిడ్ వైఫరీ(జీఎన్‌ఎం) అభ్యర్థుల పరీక్షలు సోమవారం నుండి ఖమ్మంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిర్వహించనున్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు 4, 7, 12, 14వ తేదీల్లో, రెండో సంవత్సరం విద్యార్థులకు 5, 8, 13, 15వ తేదీల్లో, మూడో సంవత్సర విద్యార్థులకు 6, 11వ తేదీల్లో పరీక్షలు జరుగుతాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్ తెలిపారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 10నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అలాగే, విద్యార్థులకు ఈనెల 17 నుండి 21వ తేదీ వరకు ప్రాక్టికల్స్ ఎగ్జామ్స్ జరుగుతాయని తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షలకు 247మంది, రెండో సంవత్సరం 223, మూడో సంవత్సరం విద్యార్థులు 123 మంది పరీక్షలు రాయనుండగా, అన్ని ఏర్పాట్లు చేశామని సూపరింటెండెంట్ వివరించారు.

### నేడు మద్యం దుకాణాలు బంద్

ఖమ్మంక్రైం: అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు దృష్ట్యా ఆదివారం జిల్లాలోని వైన్స్, బార్లు మూసివేయాలని ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి నాగేందర్‌రెడ్డి ఆదేశించారు. ఎక్కడైనా షాపులు తెరిచి మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓట్ల లెక్కింపు నేపథ్యాన అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కాగా, శుక్రవారమే జిల్లాలో నూతన మద్యం పాలసీ ప్రకారం జిల్లాలో 122 వైన్స్ ప్రారంభమైన విషయం విదితమే.

### టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా నాగేశ్వరరావు



ఏ.వీ.నాగేశ్వరరావు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడిగా ఏ.వీ.నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఖమ్మంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో తిరుమలాయపాలెం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు నాగేశ్వరరావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు అధ్యక్షుడిగా ఉన్న వి.వెంకటేశ్వరరావు హెచ్‌ఎంగా పదోన్నతిపై కామారెడ్డి జిల్లాకు వెళ్లటంతో నాగేశ్వరరావును ఎన్నుకున్నామని తెలిపారు. ఈసమావేశంలో జిల్లా కార్యదర్శి ఎస్.విజయ్‌తో పాటు ఆళ్ల రామారావు, మనోహర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఔను...వారు విజేతలు !

అన్ని అవయవాలు సక్రమంగా ఉన్న వారిలో పలువురు ఉపాధి లేదని.. ఉద్యోగం రాలేదని ఆవేదన చెందుతుంటారు. కానీ అవవయాలు సక్రమంగా లేని పలువురు ఎవరినో నిందించకుండా ఉపాధి అవకాశాలు వెతుక్కుంటున్నారు. తద్వారా కుటుంబాన్ని పోషిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. నేడు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్వశక్తితో జీవనం సాగిస్తున్న పలువురు దివ్యాంగులపై కథనాలు...

- వైకల్యాన్ని జయించిన దివ్యాంగులు
- సాధారణ వ్యక్తులతో సమానంగా జీవనం
- బతుకుపోరాటంలో వెన్నుచూపకుండా పయనం

**నేడు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం**

### జీవిత 'చిత్రం'

జూలూరుపాడు: జూలూరుపాడు మండలం కాకర్ల గ్రామానికి చెందిన కూరాకుల మల్లయ్య – శేషమ్మ కుమారుడైన నరసింహారావుకు ఆరేళ్ల వయసులో పోలియో సోకడంతో రెండు కాళ్లు చచ్చుపడిపోయాయి. అయినా స్థానికంగా పదో తరగతి వరకు చదివి, కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తిచేశాడు. ఆయనకు చిన్నతనం నుంచే బొమ్మలు గీయడంపై ఆసక్తి ఉండేది. దీంతో పెయింటింగ్‌నే జీవనోపాధిగా మలుచుకుని భార్య శ్రీలత, ముగ్గురు పిల్లలను పోషిస్తున్నారు. ఆర్టిస్ట్‌గా మంచి గుర్తింపు లభించడంతో ప్రభుత్వ, ప్రైవేట్ పథకాల సైన్ బోర్డులు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల భవనాలకు పేర్లు రాయడం, జాతీయ నాయకులు, దేవతల బొమ్మలు గీసే పనులు అప్పగిస్తున్నారు. ప్రస్తుతం ఫ్లెక్సీలు, సైన్‌బోర్డ్‌లు రాజ్యమేలుతుండగా, ఆర్థిక పరిస్థితుల కారణంగా ఆధునికతను అందిపుచ్చుకోలేపోయిన నరసింహారావు తనకు ప్రభుత్వం ద్వారా చేయూతనివ్వాలని కోరుతున్నాడు.





ఆర్ట్ వేస్తున్న నరసింహారావు

### వైకల్యాన్ని ఎదిరించి...

సుజాతనగర్ : సుజాతనగర్ మండలం సింగభూపాలెం గ్రామానికి చెందిన బుట్టి నరేష్ చిన్ననాడే పోలియో బారిన పడ్డాడు. ఒక కాలు, చేయి పూర్తిగా పనిచేయవు. ప్రభుత్వం నుంచి వస్తున్న రూ.4వేల పింఛన్ సరిపోకపోవడంతో కుటుంబ పోషణ నిమిత్తం ఆటో నడుపుతున్నాడు. సాధారణ వ్యక్తులతో సమానంగా ఆటో నడిపే ఆయన.. ఒక చోట కూర్చుని పనిచేసేలా ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాడు.



ఆటో నడుపుతున్న నరేష్

### బతుకు 'పాఠాలు'



పాఠాలు బోధిస్తున్న బానోత్ గన్యా

జూలూరుపాడు: పాపకొల్లు గ్రామానికి చెందిన బానోత్ గన్యా సంకల్ప బలంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. బానోత్ నారియా–లక్ష్మి దంపతుల కుమారుడైన గన్యా పుట్టుకతో నే దివ్యాంగుడు కాగా, వీల్‌చైర్‌కు పరిమితమైప్పటికీ స్థానికంగా పదో తరగతి వరకు పూర్తిచేశాడు. ఆ తర్వాత జూలూరుపాడులో ఇంటర్, పాల్వంచలో టీటీసీ పూర్తిచేసిన ఆయనకు 2013లో ఉపాధ్యాయుడిగా ఉద్యోగం వచ్చింది. మొదట సుజాతనగర్ మండలం మేడేపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో, ప్రస్తుతం జూలూరుపాడు మండలం భీమ్లాతండా గిరిజన ప్రాథమిక పాఠశాలలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన ఇంటర్‌తోనే ఆగిపోకుండా ఓపెన్ యూనివర్సిటీ విధానంలో డిగ్రీ, పీజీ, బీఈడీ కూడా పూర్తిచేసి చదువుకు వైకల్యం అడ్డురాదని నిరూపించారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేసేందుకు కృషి చేస్తున్న గన్యా పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు.

## క్లుప్తంగా

### డయాలసిస్ కేంద్రం స్విచ్‌బోర్డులో మంటలు

**ఉద్యోగుల అప్రమత్తతతో తప్పిన ముప్పు**



స్విచ్ బోర్డు వద్ద మరమ్మతు చేస్తున్న సిబ్బంది

**సత్తుపల్లిటౌన్:** సత్తుపల్లిలోని డయాలసిస్ కేంద్రంలోని రిసెప్షన్ కౌంటర్ వద్ద స్విచ్‌బోర్డులో మంటలు చెలరేగడంతో సిబ్బంది అప్రమత్తమై అదుపు చేయగా ప్రమాదం తప్పినట్లయింది. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రం విద్యుత్ స్విచ్‌బోర్డులో శనివారం షార్ట్ సర్క్యూట్ అయి మంటలు వచ్చాయి. ఆ సమయాన విధుల్లో ఉన్న డాక్టర్ ఎన్.కిరణ్‌కుమార్, ఫార్మా సిబ్బంది కృష్ణ అప్రమత్తమై మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే దట్టంగా పొగలు అలుముకున్నాయి. కాగా, సెంటర్‌లో ఐదుగురికి డయాలసిస్ కొనసాగుతుండగా, వారితో పాటు సహాయకులు కలిపి 20మంది వరకు ఉన్నారు. అయితే, వారు పొగల కారణంగా శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండగా వేము మోహన్‌రావు, తడికమళ్ల అశోక్, శ్రీనివాసరావు కేంద్రంలోని కిటికీ అద్దాలు పగులగొట్టడంతో పొగ బయటకు వెళ్లింది. ఆతర్వాత డయాలసిస్ కేంద్రంలోని వారిని బయటకు పంపించగా, డాక్టర్ కిరణ్‌కుమార్, సిబ్బందిని పలువురు అభినందించారు.

### టిప్పర్ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

**వైరారూరల్:** వైరా మండలంలోని సోమవరం –తాటిపూడి మధ్య టిప్పర్ ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడికి తీవ్రగాయాలయ్యాయి. బోనకల్ మండలం మోటమర్రికి చెందిన కొత్తపల్లి నాగేశ్వరరావు శనివారం తన ద్విచక్రవాహనంపై వైరా వస్తుండగా, మధిర వైపు వెళ్తున్న ఖాళీ టిప్పర్ ఆయన ద్విచక్రవాహనాన్ని ఎదురుగా ఢీకొట్టింది. ఈ ఘటనలో నాగేశ్వరరావు కుడి కాలు నుజ్జు నుజ్జయి తీవ్ర రక్తస్రావం కాగా, ఖమ్మం తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

**పెనుబల్లి మండలంలో...**

**పెనుబల్లి:** ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఘటన పెనుబల్లి మండలం తుమ్మలపల్లి వద్ద జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. వీఎం బంజర్, రాంచందర్‌రావు బంజర్‌కు చెందిన ఎలక్ట్రీషియన్లు మధు, తడికమళ్ల అనిల్ కుప్పెనకుట్ల నుండి వీఎంబంజర్‌కు ద్విచక్రవాహనంపై వస్తున్నారు. మార్గమధ్యలో తుమ్మలపల్లి చర్చి వద్ద జాతీయ రహదారిపై గేదె అడ్డుగా వచ్చి బండికి తగలడంతో కింద పడ్డారు. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలు కాగా, స్థానికులు పెనుబల్లి ఆస్పత్రికి తరలించారు.

### ఆటోడ్రైవర్ల పరస్పర దాడులు

**నేలకొండపల్లి:** ఆటోలో ప్రయాణికులను ఎక్కించే విషయంలో డ్రైవర్ల మధ్య మొదలైన వివాదం దాడులకు దారి తీసింది. మండలకేంద్రంలో శనివారం ఆటోడ్రైవర్ల మధ్య ఘర్షణ జరిగింది. ఖమ్మంకు చెందిన జావీద్ నేలకొండపల్లి సెంటర్‌లో సీరియల్‌ను కాదని తన ఆటోలో ప్రయాణికులను ఎక్కిస్తుండగా స్థానిక డ్రైవర్లు అడ్డుకున్నారు. యూనియన్ ఒప్పందాన్ని ఉల్లంఘించడంపై నిలదీయడమే కాక ఆటోలను రోడ్డుకు అడ్డంగా పెట్టటంతో సెంటర్‌లో వాహనాలు నిలిచిపోయాయి. డ్రైవర్లు దూషించుకుంటూ పరస్పరం దాడి చేసుకున్నారు. చివరకు ఇరువర్గాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై బి.సతీష్ విచారణ చేపట్టారు.

### ప్రెజర్‌బాంబు పేలి ఇద్దరు జవాన్లకు తీవ్ర గాయాలు

**ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో ఘటన**

**చర్ల:** మావోయిస్టులు ఏర్పాటు చేసిన ప్రెజర్ బాంబు పేలడంతో ఇద్దరు జవాన్లు తీవ్రంగా గాయపడిన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లాలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మావోయిస్టు పార్టీ పీఎల్‌జీఏ వారోత్సవాలకు పిలుపునిచ్చిన నేపథ్యాన తెలంగాణతో పాటు ఛత్తీస్‌గఢ్ పోలీసులు కూంబింగ్ ముమ్మరంగా చేపట్టారు. ఈ క్రమాన దంతెవాడ జిల్లా బార్సూర్ పోలీస్‌స్టేషన్ పరిధి అటవీ ప్రాంతంలో కూంబింగ్‌కు వెళ్లిన సీఆర్‌పీఎఫ్ బలగాల్లోని ఒక జవాను మావోయిస్టులు ఏర్పాటు చేసిన ప్రెజర్‌బాంబును గమనించకుండా కాలు వేయడంతో అది పేలి ఆయనతో పాటు మరో జవాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఇద్దరిని బార్సూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించి ప్రథమ చికిత్స అనంతరం దంతెవాడ జిల్లా కేంద్రానికి తరలించారు. కాగా, ప్రెజర్‌బాంబు పేలిన ప్రాంతంలో ఇంకేమైనా మందుపాతరలు ఉన్నాయేమోనని అనుమానంతో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు.

# అయ్యప్పలకు ప్రత్యేకం!


కొత్తగూడెంలోని శ్రీధర్మశాస్తా ఆలయంలో భోజనం చేస్తున్న మాలధారులు

**కొత్తగూడెం ఆలయంలో ప్రతిరోజు 2 వేల మందికి భోజనం**

- 23 ఏళ్లుగా కొనసాగుతున్న నిత్య అన్నదానం
- మధ్యాహ్నం అరటి ఆకులో భోజనం, రాత్రి అల్పాహారం కూడా..
- ఉమ్మడి జిల్లాలోనే తొలిసారి ఇక్కడే మొదలు

**కొత్తగూడెంటౌన్:** ఇంట్లో నలుగురు సభ్యులు ఉన్నా.. ఏదైనా శుభకార్యంలో వంద మందికి భోజనాలను పెట్టాలంటే ప్రయాస పడుతుంటాం. కానీ, ఇక్కడ రెండు వేల మంది అయ్యప్ప మాలధారులకు నిత్యాన్నదానం జరుగుతోంది. ఒకటి కాదు రెండు కాదు 23 ఏళ్లుగా సీజన్‌లో మాలధారులకు మధ్యాహ్న భోజనం, మూడేళ్లుగా రాత్రి అల్పాహారం అందజేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం రైటర్‌బస్తీలోని శ్రీధర్మశాస్తా ఆలయం ఈ కార్యక్రమం కొనసాగిస్తూ మాలధారులకు అండగా నిలుస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే ఇలాంటి కార్యక్రమాన్ని మొదటగా చేపట్టిన ఆలయంగా శ్రీధర్మశాస్తా ఆలయం గుర్తింపు సాధించింది.

**2021 నుంచి రాత్రి అల్పాహారం**

మధ్యాహ్న భోజనం సమకూరుస్తున్నా రకరకాల కారణాలతో రాత్రివేళ మాలధారులు పలువురు అల్పాహారం చేసుకోలేపోతున్నట్లు గుర్తించారు. దీంతో 2021 నుంచి ప్రతిరోజు ఆలయానికి వచ్చే భక్తుల కోసం రాత్రి పూట అల్పాహారం సైతం ఏర్పాటు చేస్తున్నారు. మధ్యాహ్న భోజనంలో అన్నం, సాంబారు, పప్పు, పెరుగు, పచ్చడి, పులిహోర, దద్దోజనంతోపాటు ఇతర కూరలు ఉంటాయి. ఇక రాత్రి అల్పాహారంగా నాలుగు ఇడ్లీ, రెండు వడలు వడ్డిస్తారు.


అరిటాకులో వడ్డించిన భోజనం

**23 ఏళ్ల నుంచి నిర్విఘ్నంగా..**

2000 ఏడాదిలో మాలధారులకు నిత్యాన్నదానాన్ని దాతల సాయంతో ఆలయ కమిటీ ఆధ్వర్యాన ప్రారంభించారు. నవంబర్‌లో అయ్యప్ప దీక్షలు ప్రారంభమైనప్పటి నుంచి సంక్రాంతికి దీక్ష విరమణ సమయం వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. స్థానిక భక్తులే కాకుండా ఉమ్మడి ఖమ్మం జిల్లా, నల్లగొండ జిల్లా నుంచి పనులపై వచ్చే మాలధారులు ఇక్కడ భోజనం చేయొచ్చు. 23 ఏళ్లుగా ఈ కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగుతుండడంతో దాతలు చేయూతనిస్తున్నారు. ఇక్కడ రోజుకు 2 వేల మందికి పైగానే భోజనం చేస్తారని అంచనా.


కొత్తగూడెం రైటర్‌బస్తీలోని శ్రీధర్మశాస్తా ఆలయం

**సేవ చేయడం భాగ్యం**



శ్రీధర్మశాస్తా ఆలయంలో ప్రతిరోజు మాలధారులతో కలిసి పూజలు భజనలు చేయడం, వందలాది మందితో స్వామిని పూజించడం అదృష్టమేనని చెప్పాలి. తోటి మాలధారులతో కలిసి పూజలు చేయడమే కాక అందరం భోజనం చేస్తుండడం ఆనందంగా ఉంది.

– గరినే శ్రీనివాసరావు ఆలయ కమిటీ సభ్యుడు

**అదృష్టంగా భావిస్తున్నా**



అయ్యప్ప స్వామిపై భక్తితో మాలధారులకు గత 23 ఏళ్ల నుంచి భోజనం సమకూరుస్తున్నాం. రెండేళ్లుగా రాత్రి పూట అల్పాహారం సమకూర్చడం ప్రారంభించాం. ప్రతిరోజు 2 వేల మంది అయ్యప్పలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నా.

– కన్నెగంటి కృష్ణమూర్తి, ఆలయ కార్యదర్శి

**ఆనందంగా ఉంది**



ప్రతిరోజు నాతో పాటు సుమారు రెండు వేల మంది అయ్యప్ప మాలధారులు వస్తుంటారు. అందరితో కలిసి భోజనం చేయడం ఆనందంగా ఉంటుంది. భక్తులతో కలిసి గడపడం, మహోన్నత కార్యక్రమంలో భాగస్వామిని కావడం పూర్వజన్మ సుకృతం.

–జక్కుల విజయ్‌కుమార్

**ఇది మంచి అవకాశం**



ఆలయంలో మాలధారులకు అన్నదానం చేయడం గొప్ప కార్యం. ఈ కార్యక్రమంలో నా వంతుగా సేవ చేయడం స్వామి ఇచ్చిన అవకాశంగా భావిస్తున్నా. అయ్యప్పమాల ధరించి నిత్యం వందలాది మందితో మాలధారులతో భోజనం చేయడం నా అదృష్టం.

–ఎర్రా ఈశ్వర్, అయ్యప్ప మాలధారి

# మళ్లీ గెలిచేది బీఆర్‌ఎస్సే...

- నా తరఫున శ్రమించిన అందరికీ కృతజ్ఞతలు
- ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్


మాట్లాడుతున్న పువ్వాడ అజయ్‌కుమార్

**ఖమ్మంమయూరిసెంటర్:** ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధితో ప్రజలంతా బీఆర్‌ఎస్ వెంటే ఉన్నారని, తద్వారా రాష్ట్రంలో మళ్లీ గెలిచేది తమ పార్టీయేనని ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఖమ్మం మమత మెడికల్ కళాశాలలోని తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో పువ్వాడ మాట్లాడారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా తనను సీఎం కేసీఆర్ ప్రకటించిన నాటి నుండి ప్రచారంలో పాల్గొని విజయం కోసం శ్రమించిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై నమ్మకంతో ఓటు వేసిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. మొదటిసారి కేసీఆర్ 63 సీట్లతో అధికారం చేపట్టగా... పలువురు ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు యత్నించారని చెప్పారు. అలాగే, చాలా మంది కాంగ్రెస్ నాయకులు తెలంగాణను మళ్లీ ఆంధ్రలో కలపాలనే కుట్రలు చేశారని, వాటిని కేసీఆర్ తిప్పికొట్టి ప్రజలకు సుపరిపాలన అందించారని తెలిపారు. రెండోసారి ఎన్నికల్లో సమైక్యవాదులంతా మహాకూటమి రూపంలో కేసీఆర్‌ను ఎదురించినా ప్రజలంతా ఆయన వెంట నిలబడ్డారని వివరించారు. ప్రస్తుత ఎన్నికల్లోనూ ప్రజలు నమ్మకంతో ఓట్లు వేయగా... రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం, కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని పువ్వాడ తెలిపారు.

# బీఆర్‌ఎస్ పార్టీదే హ్యాట్రిక్ విజయం

**పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్**


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాత మధు

**ఖమ్మంమయూరిసెంటర్:** తెలంగాణలో మూడోసారి బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్ ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అభ్యర్థుల విజయానికి అంకిత భావంతో కష్టపడ్డారని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి హరీశ్‌రావు, ఎన్నికల సమన్వయ బాధ్యతలు నిర్వర్తించిన ఎంపీలు నామా నాగేశ్వరరావు, డాక్టర్ బండి పార్థసారధి రెడ్డి, వద్దిరాజు రవిచంద్రతో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో కంటే ఈ ఎన్నికలు భిన్నంగా జరిగినా అభివృద్ధి, సంక్షేమం వైపు ప్రజలు నిలబడ్డారని చెప్పారు. ఏదిఏమైనా తమ పార్టీ అధికారంలోకి రాబోతుందని, కేసీఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రి కానున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఉప్పల వెంకటరమణ, చింతనిప్పు కృష్ణచైతన్య, డోకుపర్తి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# సత్యనారాయణ స్వామిని దర్శించుకున్న 'జలగం'


ఆలయం వద్ద వెంకట్రావు

**పెనుబల్లి:** కొత్తగూడెం ఎమ్మెల్యే అభ్యర్థి జలగం వెంకట్రావు శనివారం మండలంలోని బయ్యన్నగూడెం సత్యనారాయణ స్వామి ఆలయాన్ని దర్శించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు స్వాగతం పలికి పూజలు చేయించారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆదివారం వెలువడనుండడంతో స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అభిమానులు, తన స్నేహితులతో వెంకట్రావు మాట్లాడారు. ఏరుగట్ల మాజీ సర్పంచ్ ఎస్‌కె కరీముల్లా, నాయకులు దొంతు మాధవరావు, కావిటి శ్రీనివాసరావు, పాముర్తి వెంకటేశ్వరరావు, యు.ప్రసాద్, కావటి చిన్న శ్రీను, మల్లాది రవి, రావూరి హనుమంతరావు, బాజిని రామనరసింహం తదితరులు పాల్గొన్నారు.

# రూ.500 నోట్ల హవా..!

- ఓటుకు నోటు పంపకాల్లో కీలకపాత్ర?
- అన్ని చోట్లా పెరిగిన పెద్దనోట్ల వాడకం
- సగానికి పడిపోయిన డిజిటల్ చెల్లింపులు
- అంతటా తగ్గిన ఏటీఎంల వినియోగం


వినియోగదారులు లేక ఖాళీగా ఉన్న ఏటీఎం

**చుంచుపల్లి:** అసెంబ్లీ ఎన్నికల పుణ్యమా అని ప్రస్తుతం మార్కెట్లో రూ.500 నోటు హవా కొనసాగుతోంది. ఎవరి చేతిలో చూసినా ఈ నోటే సందడి చేస్తోంది. రెండు, మూడు రోజులుగా సాధారణ వ్యక్తులతో పాటు అన్ని వర్గాల ప్రజల వరకు రూ.500 నోట్లు జోరుగా చేతులు మారుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇటీవల జోరుగా నగదు పంపిణీకి తెర లేపినట్లు తెలిసింది. ఓటర్లకు పంచడానికి ఈ పెద్ద నోట్లనే పెద్ద సంఖ్యలో వాడినట్లు కూడా సమాచారం. ఓటుకు నోటు పంపిణీలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లకు రూ.500 నోట్లను అందజేసినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓటర్లను ప్రలోభ పెట్టి తమ వైపు తిప్పుకునేందుకు ఖర్చుకు వెనకాడకుండా పెద్ద మొత్తంలో నగదు పంపిణీ చేసినట్లు అన్ని చోట్లా ఆరోపణలు వినిపించాయి. ఈసారి ఎన్నికల్లో అన్ని చోట్లా రూ.500 నోట్ల కట్టలు పెద్దఎత్తున చేతులు మారినట్లు తెలిసింది. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు ఓటుకు రూ.1,000 నుంచి 2,000 చొప్పున పంపిణీ చేసినట్లు పలువురు చెబుతున్నారు. అక్కడక్కడా పోటీ తీవ్రతను బట్టి ఓటర్లకు కొంత అదనంగా కూడా ముట్టజెప్పినట్లు కూడా వినిపించింది. అన్ని నియోజకవర్గాల్లో ఈ తంతు గత నెల 27 నుంచి 30 వరకు రాత్రింబవళ్లు కొనసాగగా.. ఈ పంపిణీలో ప్రధాన పార్టీల అభ్యర్థులు రూ.500 నోట్లనే పెద్ద మొత్తంలో సద్వినియోగం చేసుకున్నట్లు సమాచారం. ప్రతి గ్రామ పరిధిలో 70 శాతం చొప్పున ఈ పెద్దనోటు చేరింది. ఒకే ఇంట్లో నాలుగైదు ఓట్లు ఉంటే ఇక వారి పంట పండింది. కనీసం నాలుగు ఓట్లు ఉన్నవారికి దాదాపు 10 వేలకు పైగా చేతికందినట్లు తెలిసింది. ఈ ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు విచ్చలవిడిగా డబ్బును పంచారనే ఆరోపణలు సర్వత్రా వినిపించాయి. జిల్లాలో 5 నియోజకవర్గాల పరిధిలో దాదాపు రూ.300 కోట్ల వరకు ఓటర్లకు పంపిణీ జరిగినట్లు అంచనా. అధికార పార్టీ అభ్యర్థులు ఓటుకు రూ.1,500 నుంచి రూ.2,000 వేల చొప్పున నగదును పంపిణీ చేయగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు రూ.1,000 చొప్పున 70శాతం ఓటర్లకు అందజేసినట్లు తెలుస్తోంది. ఒక్కొక్క అభ్యర్థికి నియోజకవర్గ పరిధిలో రూ.30 నుంచి రూ.40 కోట్ల వరకు పంచడానికి ఖర్చయినట్లు సమాచారం.

**డిజిటల్ లావాదేవీలు తగ్గుముఖం..**

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరి చేతికి నగదు చేరింది. ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో దండిగా కరెన్సీ ఉంది. దీంతో ప్రజలు తమ అవసరాల కోసం మార్కెట్‌కు వెళ్లాలంటే రూ.500 నోట్లనే ఎక్కువగా వినియోగిస్తున్నారు. కూరగాయలతో పాటు చిన్నాచితకా అవసరాలకు సైతం ఈ పెద్దనోటునే తీస్తున్నారు. అన్ని అవసరాలకు ఈ రూ.500 నోటే ఆధారంగా నిలుస్తోంది. రెండు రోజులుగా డిజిటల్ లావాదేవీలు సైతం తగ్గిపోయాయని బ్యాంకు అధికారులు, వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరూ తమ అవసరాల నిమిత్తం చేతి నుంచే నగదు అందజేస్తున్నారని ఇందుకోసం ఎన్నికల వేళ ఇచ్చిన రూ.500 నోట్లనే ఎక్కువగా వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఇక మార్కెట్లో రూ.500 నోట్ల తాకిడితో రూ.100, రూ.200 నోట్ల చెలామణి అంతగా కనిపించడం లేదు. అంతటా పెద్దనోట్లు వాడటంతో అటు చిల్లర సమస్యలు తలెత్తుతున్నాయి. ఇటు ఫోన్‌–పే, గూగుల్–పే వినియోగం సగానికి తగ్గిపోగా, అటు ప్రధాన బ్యాంకులకు చెందిన ఏటీఎంలలో వినియోగదారుల సందడి కనిపించడం లేదు. అందరికీ చేతినిండా నగదు ఉండటంతో అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. దీంతో పలు ఏటీఎం సెంటర్లు సైతం కస్టమర్లు లేక వెలవెలబోయి కనిపిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ పెద్ద నోట్ల చలామణి పెరిగిందని వ్యాపార వర్గాలు పేర్కొంటుండగా, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులు సైతం కండక్టర్లకు రూ.500 నోటునే ఇవ్వటంతో చిల్లర లేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. ఏదేమైనప్పటికీ ఇప్పటివరకు అంతగా కనిపించని రూ.500 నోట్లు ప్రస్తుతం మార్కెట్‌లో సందడి చేస్తున్నాయి.

### తమ్ముడిపై అన్న దాడి

**కారేపల్లి:** తమ్ముడిపై దాడికి పాల్పడి గాయపరిచిన అన్నపై పోలీసులు కేసు నమోదు చేశారు. కారేపల్లి మండలం మంగళితండాకు చెందిన పిల్లలమర్రి లక్ష్మణ్ ఖాళీ స్థలంలో పిల్లలమర్రి వీరన్న, ఆయన కుమారుడు నరేందర్ వరిగడ్డి వామివేశారు. ఈక్రమంలో అన్నాదమ్ములైన లక్ష్మణ్, వీరన్న నడుమ వాగ్వాదం జరగగా.. వీరన్న తన తమ్ముడు లక్ష్మణ్ తలపై కర్రతో బాదాడు. నరేందర్ కూడా దాడి చేయడంతో లక్ష్మణ్‌కు గాయాలయ్యాయి. దీంతో వీరన్న, నరేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామారావు తెలిపారు.

### రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

**ఎర్రుపాలెం:** ఎర్రుపాలెం – గంగినేని స్టేషన్ల మధ్య శనివారం ఉదయం రైలు ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి(45) మృతిచెందాడు. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడ వైపు వెళ్లే లైన్‌లో సదరు వ్యక్తిని రైలు ఢీకొట్టగా అక్కడికక్కడే కన్నుమూశాడు. అయితే, మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోగా, ఆయన స్టేషన్ సమీపాన శుక్రవారం సాయంత్రం తెలుగు, తమిళ భాషల్లో మాట్లాడుతూ తిరిగాడని సమాచారం. మృతదేహాన్ని అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 99636 41484, 87126 58607 నంబర్లకు సమాచారం ఇవ్వాలని వేణుగోపాల్‌రెడ్డి కోరారు.

### మున్నేరులో పడి యువకుడు మృతి

**ఖమ్మంరూరల్:** మండలంలోని నాయుడుపేట సమీపాన మున్నేరులో పడిన యువకుడు మృతి చెందాడు. నాయుడుపేటకు చెందిన షేక్ యాకూబ్‌పాషా(28) ఐదారు రోజుల క్రితం మున్నేటి వద్దకు వెళ్లగా అందులో పడి మృతి చెందాడు. మృతదేహం బాగా కుళ్లిపోయిన స్థితి శనివారం గుర్తించారు. కాగా, ఆయనకు మద్యం అలవాటు ఉన్నట్లు తెలిసింది. అయితే, పాషా ఆత్మహత్య చేసుకున్నాడా, ప్రమాదవశాత్తు జారి పడ్డాడా తెలియరాలేదు. స్థానికులు ఇచ్చిన సమాచారం పోలీసులు చేరుకుని వివరాలు ఆరా తీయగా, అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు మృతదేహాన్ని బయటకుతీసి మార్చురీకి తరలించారు. కాగా, మృతుడికి భార్య ఉంది.

### ఆటోలో నుంచి కిందపడి వృద్ధుడు మృతి

**పాల్వంచ:** అనారోగ్యంతో ఆస్పత్రికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా ఆటోలో నుంచి పడి వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పాత సూరారంనకు చెందిన భూక్యా లాలు (82) అనారోగ్యంతో పాల్వంచకు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుని తిరిగి ఆటోలో ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో కేటీపీఎస్ 5వ దశ సమీపానికి వచ్చే సరికి కళ్లు తిరిగి ఆటోలో నుంచి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడటంతో వెంటనే ఆయన్ను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని తెలిపారు. కూతురు భద్రమ్మ ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



### తుపాన్ ప్రభావంతో రైతుల్లో ఆందోళన

**తల్లాడ:** తుపాన్ ప్రభావంతో జిల్లా అంతటా శనివారం ఆకాశం మేఘావృతమై ఉండడం, ఆది, సోమవారాల్లో వర్షాలు కురిసే అవకాశముందన్న అధికారుల ప్రకటనతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే పలువురు రైతులు వరికోత పూర్తిచేసి కల్లాల్లో ధాన్యం ఆరబోశారు. ఇక సాగర్ కాల్వల కిందేకాక చెరువులు, కుంటలు, లిఫ్ట్‌ల కింద సాగు చేసిన వరి పైరును కోయిస్తున్నారు. వర్షాలు కురిసే అవకాశముందన్న సమాచారంలో కల్లాల్లో ఆరబోసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఓపక్క ధాన్యంపై పట్టాలు కప్పగా, తేమ తగ్గే అవకాశం లేకపోవడంతో అక్కడే ఉండి ఆరబోస్తున్నారు. ఏ క్షణాన వర్షం కురిసినా పంటను కాపాడుకునేందుకు పట్టాలు సిద్ధం చేసుకున్నారు. తుపాన్ ప్రభావంతో వర్షం పడితే కోతకొచ్చిన వరి పైరే కాక ఆరబోసిన ధాన్యం తడిస్తే పెట్టుబడి కూడా రాదనే ఆందోళన అన్నదాతల్లో వ్యక్తమవుతోంది.


తల్లాడ మార్కెట్ గోదాం వద్ద వరి ధాన్యం ఆరబోస్తున్న రైతులు

# స్టార్టప్‌లకు రూ. కోటి ఫండింగ్

## లీప్ ఎహెడ్ పేరిట ఎస్టీపీఐ స్టార్టప్ ప్రోత్సాహక కార్యక్రమం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో యువతను నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్టీపీఐ) "లీప్ ఎహెడ్" పేరిట ప్రత్యేక పథకాన్ని చేపట్టింది. ఈ పథకం ద్వారా ప్రారంభ దశలో (స్కేలింగ్) ఉన్న స్టార్టప్‌లతో పాటు గ్రోత్ స్టేజ్, ప్రోడక్ట్ డైవర్సిఫికేషన్, కొత్త ప్రాంతాలకు విస్తరించే ప్రణాళికలో ఉన్న స్టార్టప్‌లకు కోటి రూపాయల వరకు నిధులు సమకూర్చనుంది. ఈ పథకం కింద ఎంపికైన స్టార్టప్‌లకు మూడు నెలల పాటు హైబ్రీడ్ మోడల్‌లో శిక్షణ ఇచ్చి మెంటారింగ్ చేస్తూ మార్కెటింగ్, ఫండ్ రైజింగ్ వంటి అవకాశాలను కల్పిస్తుంది. ఇందుకోసం డిసెంబర్ 10లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎస్టీపీఐ కోరింది. ఇప్పటివరకు రాష్ట్రం నుంచి 75 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 15 స్టార్టప్‌లను ఎంపిక చేసి ఆర్థిక సాయం అందిస్తారు.

### ఎన్‌జీఐఎస్ కింద 95 స్టార్టప్స్ నమోదు

స్టార్టప్‌లను ప్రోత్సహించే నెక్స్ జనరేషన్ ఇంక్యుబేషన్ స్కీం (ఎన్‌జీఐఎస్) కింద రాష్ట్రంలో 95 స్టార్టప్‌లు నమోదు చేసుకున్నట్లు వినయ్‌కుమార్ తెలిపారు. ఇందులో 28 స్టార్టప్స్‌కు రూ.25 లక్షల చొప్పున సీడ్ ఫండింగ్ అందించినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం స్టార్టప్స్‌కు ప్రోత్సాహం అందిస్తుండటంతో పలు కాలేజీల్లో ఇంక్యుబేషన్ సెంటర్లలో యువత స్టార్టప్స్‌పై ప్రయోగాలు చేస్తున్నారన్నారు. విశాఖలో నాలుగో తరం సాంకేతిక పరిజ్ఞానం పెంచేలా ఏర్పాటు చేసిన కల్పతరువు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ, ఆంధ్రా విశ్వవిద్యాలయంలో నాస్కామ్ ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలు స్టార్టప్స్‌కు మంచి వేదికలుగా మారాయని ఆయన వివరించారు.

### 6న విజయవాడలో ఔట్‌రీచ్ కార్యక్రమం

లీప్ ఎహెడ్ కార్యక్రమంపై విద్యార్థులు, ఔత్సాహిక స్టార్టప్స్‌కు అవగాహన కల్పించడానికి ఈ నెల 6న విజయవాడలో ఔట్ రీచ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్టీపీఐ విజయవాడ జాయింట్ డైరెక్టర్ బి.వినయ్‌కుమార్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంక్యుబేషన్, స్టార్టప్ సెంటర్లు ఉన్న పలు ఇంజనీరింగ్ కళాశాలల్లో కూడా సదస్సులు నిర్వహిస్తామన్నారు.

# ఓట్ల కోసం టీడీపీ కుట్ర రాజకీయం!

- తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటేసిన వారిని ఏపీలో ఓటర్లుగా చేర్పించేందుకు పన్నాగం
- నిజాంపేటలోని ఓ కుల సంఘం భవనం వేదికగా వ్యూహరచన
- కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో తమ వర్గం వారితో ఓట్ల నమోదుకు డ్రైవ్



టీడీపీ ఓటరు నమోదు కౌంటర్

నిజాంపేట: ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచే సత్తా లేకపోవడంతో టీడీపీ నాయకులు కుట్ర రాజకీయాలకు తెరలేపారు. మొన్నటివరకు ఏపీలో పెద్ద ఎత్తున దొంగ ఓట్లు నమోదయ్యాయంటూ అనవసర రాద్ధాంతం చేసిన ఆ పార్టీ నేతలు ప్రస్తుతం తెలంగాణలోని ఓటర్లను ఏపీలో చేర్పించి లబ్ధి పొందేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 30న ముగియడంతో ఆ ఓటర్లను ఏపీలో ఓటర్లుగా చేర్పించేందుకు కుటిల ప్రయత్నాలకు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం శనివారం నిజాంపేటలోని ఓ పాఠశాలలో ఏకంగా కౌంటర్ ఏర్పాటు చేశారు. 'ఏపీ కొత్త ఓటర్ల రిజిస్ట్రేషన్, ఓటర్ వెరిఫికేషన్ డ్రైవ్' అంటూ బ్యానర్ సైతం కట్టారు. తమ పార్టీకి అనుకూలంగా ఉండే వారందరినీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కోరుతున్నారు. ఈ కుట్రకు మణికొండలో ఉన్న ఓ కుల సంఘం భవనం వేదికగా రెండు రోజుల కిందట ప్రణాళిక రచించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో ఆ వర్గం దొంగ ఓట్ల నమోదుకు టీడీపీ ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. ఈ గిమ్మిక్కులు చూస్తున్న స్థానికులు అవాక్కవుతున్నారు.

# ప్రభుత్వ బడులకు అంతర్జాతీయ నైపుణ్యాలు

## భవిష్యత్‌లో విద్యార్థులు ప్రపంచ స్థాయి అవకాశాలను అందుకునేలా తీర్చిదిద్దనున్న ఏపీ ప్రభుత్వం

- పాఠశాలల్లో రూ.2,400 కోట్లతో డిజిటల్ వసతులు
- 6 నుంచి ఇంటర్ విద్యార్థులకు టెక్నాలజీపై ప్రాథమిక పాఠాలు
- ఏఐ, ఐవోటీ, డేటా సైన్స్, మెషీన్ లెర్నింగ్, గేమింగ్ సహా వివిధ సబ్జెక్టుల్లో బోధన
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి 6,200 హైస్కూళ్లలో అమలు
- ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఇంజనీరింగ్ నిపుణులతో తర్ఫీదు




సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు భవిష్యత్తులో ప్రపంచ స్థాయిలో అవకాశాలను అందిపుచ్చుకునేలా రాష్ట్ర ప్రభుత్వం వారిని తీర్చిదిద్దనుంది. ఈ నేపథ్యంలో ఆరో తరగతి నుంచే వివిధ టెక్ పాఠాలను బోధించనుంది. ఈ మేరకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను భవిష్యత్ టెక్ నిపుణులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. వచ్చే ఏడాది (2024–25) నుంచి మొత్తం 6,200 హైస్కూళ్లలో ఫ్యూచర్ స్కిల్స్‌ను అందించనుంది. ఇంటర్నెట్ ఆఫ్ థింకింగ్స్ (ఐవోటీ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్), బ్లాక్‌చైన్ టెక్నాలజీ, వర్చువల్ రియాలిటీ (వీఆర్)– ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), మెటావర్స్/ వెబ్ 3.0, 3డీ మోడలింగ్ అండ్ ప్రింటింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, బిగ్ డేటా/డేటా అనలిస్ట్, రోబోటిక్స్, గేమింగ్ వంటి విభాగాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. రాబోయే కాలంలో ఈ కోర్సులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉండడంతో స్కూల్ స్థాయిలోనే వీటిపై పూర్తి అవగాహన కల్పించనున్నారు. ప్రస్తుతం విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్, హిందీ, సైన్స్, సోషల్, మ్యాథ్స్ (6) సబ్జెక్టులను చదువుతుండగా, ఇకపై ఏడో సబ్జెక్టుగా టెక్ పాఠాలు చదువుతారు. వచ్చే ఏడాది ఆరు, 9 తరగతి విద్యార్థులకు టెక్ పాఠాలను బోధించనున్నారు. 2025–26లో 7, 10 తరగతులకు, 2026–27లో ఎనిమిది, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫ్యూచర్ స్కిల్స్‌పై శిక్షణ అందించనున్నారు. ఇలా 2028 నాటికి మొత్తం ఆరు నుంచి +2 వరకు ఈ కార్యక్రమాన్ని విస్తరించనున్నారు.

### డిజిటల్ వసతుల కోసం రూ.2,400 కోట్ల ఖర్చు..

ఇప్పటికే పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు (ఐఎఫ్‌పీలు), స్మార్ట్ టీవీలు, ట్యాబ్స్, ఇంగ్లిష్–మ్యాథ్స్ – పాల్ – కంప్యూటర్ ల్యాబ్స్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ లెర్నింగ్ కోసమే దాదాపు రూ.2,400 కోట్లు ఖర్చు చేస్తోంది. ఇకపై టెక్ అంశాల్లో విద్యార్థుల ఆలోచన శక్తిని పెంపొందించడంతోపాటు విజ్ఞానంలో ముందుండేలా శిక్షణనివ్వనున్నారు. నాస్కామ్, జేఎన్‌టీయూ నిపుణులు, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఏపీఎస్‌ఈఆర్‌టీ), స్వతంత్ర నిపుణులు రూపొందించిన ఫ్యూచర్ స్కిల్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధ్యక్షతన మంత్రిమండలి ఆమోదం తెలిపింది. దీంతో వచ్చే విద్యా సంవత్సరం నుంచే ఈ కార్యక్రమాన్ని అమల్లోకి తీసుకురావడానికి అధికారులు సిద్ధమయ్యారు.

### తరగతిని బట్టి టెక్ కరిక్యులమ్..

విద్యార్థులకు అనువుగా ఎంపిక చేసిన అంశాలకు ప్రత్యేక కరిక్యులమ్‌ను సైతం రూపొందించారు. 6–8 తరగతులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కాన్సెప్ట్స్, ఆల్గారిథమ్, డేటా ఎనాలసిస్, ఏఐ ఎథిక్స్ అండ్ సోషల్ ఇంపాక్ట్స్, మ్యాథ్స్ అండ్ స్టాటిస్టిక్స్ అంశాల్లో ప్రాథమిక అంశాలపై అవగాహన కల్పిస్తారు.

- ▲ 9–10 తరగతులకు 'ఏఐ' టెక్నాలజీ, మెషీన్ లెర్నింగ్‌పై ప్రాథమిక అవగాహన, అప్లికేషన్స్, ఆల్గారిథమ్ అండ్ డేటా ఎనాలసిస్, ఆర్టిఫిషియల్ ఎథిక్స్, సోషల్ ఇంపాక్ట్, మ్యాథ్స్ అండ్ స్టాటిస్టిక్స్‌ను నేర్పిస్తారు.
- ▲ 11–12 తరగతుల విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అడ్వాన్స్‌డ్ అంశాలను బోధిస్తారు.

ఈ అంశాల్లో అన్ని పాఠశాలల్లోనూ ఒకేసారి ఒకే పాఠాన్ని బోధించనున్నారు. దీనివల్ల విద్యార్థులు ఒక స్కూలు నుంచి మరో స్కూలుకు మారినా టెక్ అంశాల బోధనలో మార్పు ఉండదు. దీంతో విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపడడంతో పాటు అంతర్జాతీయ అవకాశాలను అందుకునే నైపుణ్యాలు నేర్చుకుంటారు.

### ఏడో సబ్జెక్టుగా టెక్ పాఠాలు..

6,200 ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు టెక్నాలజీ నైపుణ్యాలను నేర్పించేందుకు కంప్యూటర్ సైన్స్ లేదా ఎలక్ట్రానిక్స్‌లో ఎంటెక్/ఎంసీఏ/బీటెక్ చివరి ఏడాది చదువుతున్న విద్యార్థులు ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. తమ ప్రాజెక్టులో భాగంగా వీరు ఫ్యూచర్ స్కిల్స్ ఫెసిలిటేటర్స్‌గా ప్రభుత్వ పాఠశాలల్లో సేవలు అందిస్తారు. విద్యార్థులకు టెక్ పాఠాలు బోధించే ఉపాధ్యాయులకు వీరు 'టెక్నాలజీ లీడ్' శిక్షణ ఇస్తారు. ఏటా డిసెంబర్/ఏప్రిల్ నెలల్లో విద్యార్థులకు ప్రత్యేకంగా ఇండక్షన్ శిక్షణ ఇస్తారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో డిసెంబర్ 15 నాటికి ఇండక్షన్ ట్రైనింగ్ పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

### సిలబస్ సిద్ధం చేస్తున్నాం..

ఎంపిక చేసిన 10 మాడ్యూల్స్ బోధనకు సిలబస్‌ను సిద్ధం చేస్తున్నాం. డిసెంబర్ నాటికి అన్ని స్కూళ్లకు ఐఎఫ్‌పీలు నూరు శాతం అందుబాటులోకి వస్తాయి. ఫ్యూచర్ స్కిల్స్ ఫెసిలిటేటర్స్ నియామకానికి అనుమతి లభించింది, వచ్చే నెల రోజుల్లో వీరి నియామకం పూర్తవుతుంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 6,200 హైస్కూళ్లలో ఫ్యూచర్ స్కిల్స్‌పై బోధన ప్రారంభమవుతుంది.

– కాటమనేని భాస్కర్, కమిషనర్, పాఠశాల విద్యాశాఖ మౌలిక వసతులు

# ఒక వ్యక్తికి ఒక ఓటే ఉండాలి

- తెలంగాణలో ఓటున్న వారు ఇక్కడా ఓటు వేయడానికి చూస్తున్నారు
- ఏపీ మంత్రి మేరుగు నాగార్జున



పల్లెకోన (భట్టిప్రోలు): భారత రాజ్యాంగం ప్రకారం పేదవాడికైనా, కోటీశ్వరుడికైనా ఒక్క ఓటు మాత్రమే ఉంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున అన్నారు. భట్టిప్రోలు మండలం పల్లెకోనలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి ఓటు ఉండాలని కానీ ఓట్లు కాదన్నారు. తెలంగాణలో ఓటు వేసిన వారు కూడా ఆంధ్రాలో ఓటు వేయడానికి ప్రయత్నిస్తున్నారని, అది కరెక్టు కాదన్నారు. ఓటుకు నోటుతో వైఎస్సార్ సీపీని ఓడించాలని కొన్ని పార్టీలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు 60 లక్షలకుపైగా దొంగ ఓట్లను చేర్పించారని, దీనిపై ఎన్నికల కమిషనర్‌ని కూడా కలసి ఫిర్యాదు చేశామని తెలిపారు. పక్క రాష్ట్రాల నుంచి కూలీ పనులకు వచ్చిన వారి ఓట్లు చేర్చి కుప్పం నియోజకవర్గంలో ఇప్పటి వరకు చంద్రబాబు గెలుస్తున్నాడని, దీనిపై ఎన్నికల కమిషన్ రియాక్ట్ అవ్వాల్సిందేనన్నారు. వైఎస్సార్ సీపీ త్రికరణ శుద్ధితో ఎన్నికలకు వెళ్లాలని యోచిస్తున్నట్లు చెప్పారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టులో చట్టబద్ధంగా రావాల్సిన వాటా మాత్రమే తీసుకున్నామని మంత్రి నాగార్జున తెలిపారు. సీఎం వైఎస్ జగన్ ధైర్యవంతుడు కాబట్టి వెంటనే స్పందించారన్నారు. నీటి వాటాల విషయంలో అవసరమైతే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంటుందని తెలిపారు.


శనివారం తిరుమల శ్రీవారిని కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి

జిల్లా వార్తలు

# యాసంగి విత్తనాలు రెడీ..

- ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో అందుబాటులో విత్తనాలు
- వరి, పెసర, మినుము విత్తనాలకు బైబ్యాక్ విధానం
- సహకార సంఘాలు, ఆగ్రో రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ


అమ్మకానికి సిద్ధంగా ఉన్న వరి విత్తన బ్యాగులు (ఇన్‌సెట్) పెసర విత్తన సంచులు

ఖమ్మంవ్యవసాయం: యాసంగి పంటల సాగుకు సంబంధించి ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతుల కోసం తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ విత్తనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. జిల్లాల వారీగా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సాగుకు అవసరమైన విత్తనాలను సిద్ధం చేశారు. అంతేకాక వరి, పెసర, మినుము, విత్తనాలను బైబ్యాక్ పద్ధతిలో విత్తనోత్పత్తికి సంస్థ అవకాశం కల్పిస్తోంది. ఈ ఏడాది కురిసిన వర్షాలు, భూగర్భ జలాలు, నీటి వనరులను దృష్టిలో పెట్టుకొని ఖమ్మం, భద్రాద్రి జిల్లాలకు అవసరమైన విత్తనాలు పంపిణీ చేయనున్నారు. కాగా, ఈ ఏడాది సాధారణం కన్నా తక్కువగా వర్షపాతం నమోదైంది. దీంతో జలాశయాల్లో నీటి నిల్వలు అడుగంటగా, నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టుల్లో నీరు సమృద్ధిగా లేకపోవటం, భూగర్భ జలాలు పడిపోవడంతో యాసంగి పంటల సాగు గణనీయంగా తగ్గే అవకాశముందని భావిస్తున్నారు. అయితే, యాసంగి కాలం, నేలల రకాలు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నిపుణులు ఎంపిక చేసిన విత్తనాలను రైతులకు పంపిణీ చేయనున్నారు. కాగా, విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా పంపిణీ చేసే విత్తనాలకు ఎలాంటి రాయితీ వర్తించదని చెబుతున్నారు.

### ప్రామాణిక విత్తనాలు..

నిర్దేశించిన వ్యవసాయ క్షేత్రాల నుంచి వరి, పెసర, మినుము, మొక్కజొన్న, వేరుశనగ తదితర విత్తనాలను సేకరించి, ప్రయోగశాలల్లో మొలక శాతం పరీక్షించాక విత్తనశుద్ధి చేసి పంపిణీ చేస్తారు. అంతేకాక వివిధ ప్రాంతాల నుంచి విత్తనాలను తెప్పించి అన్ని పరీక్షల అనంతరం పంపిణీకి సిద్ధం చేశారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సాగు చేసే వరి రకాలు, అపరాల పంటలైన పెసర, మినుము, మొక్కజొన్న, శనగ పంట రకాలను వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు ఖమ్మం విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా రైతులకు పంపిణీ చేస్తారు. ఆయా విత్తనాలను నిర్దేశించిన ధరలకు పీఏసీఎస్‌లు, ఆగ్రో రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయించనున్నారు.

**25 కిలోల వరి విత్తనాల బ్యాగ్ ధర (రూ.ల్లో)**

| రకం | ధర |
|---|---|
| ఎంటీయూ–1010 | 882-50 |
| బీపీటీ 5204 | 887-50 |
| పీకేవీ హెచ్‌ఎంటీ | 912-50 |
| కేఎన్‌ఎం 1638 | 1,059-00 |
| కేఎన్‌ఎం–118 | 882-50 |
| ఆర్‌ఎన్‌ఆర్–15048 | 882-50 |
| ఎన్‌డీఎల్‌ఆర్–7 | 887-50 |
| జేజీఎల్ - 24423 | 887-50 |
| ఉమా రకం | 874-50 |

**అపరాలు, ఇతర విత్తన ధరలు (రూ.ల్లో)**

| రకం | విత్తన బ్యాగ్ బరువు | ధర |
|---|---|---|
| పెసర ఎంజీజీ–295 | 4 కిలోలు | 432-40 |
| ఎంజీజీ–351 | 4 కిలోలు | 432-40 |
| ఎంజీజీ–347 | 4 కిలోలు | 432-40 |
| మినుములు పీయూ–31 | 4 కిలోలు | 424-00 |
| టీబీజీ–104 | 4 కిలోలు | 424-00 |
| జీబీజీ–1 | 4 కిలోలు | 424-00 |
| కంది ఐసీపీఎల్–87119 | 4 కిలోలు | 452-00 |
| మొక్కజొన్న డీహెచ్‌ఎం–117 | 5 కిలోలు | 600-00 |
| వేరుశనగ గిరియార్–5 | 30 కిలోలు | 2,865-00 |

### వరి, అపరాల విత్తనాలు ఇలా..

ఉమ్మడి జిల్లాలో నేలల రకాలకు అనుకూలమైన విత్తనాలను విత్తనాభివృద్ధి సంస్థ అందుబాటులోకి తీసుకొచ్చింది. వరిలో ఎంటీయూ–1010 రకం 186.15 క్వింటాళ్లు, బీపీటీ–5204 మూడు క్వింటాళ్లు, కేఎన్‌ఎం–1638 10.25 క్వింటాళ్లు, ఎన్‌డీఎల్‌ఆర్–7 రకం 272 క్వింటాళ్లు, జేజీఎల్–24423 రకం 1.25 క్వింటాళ్లు, ఉమా రకం 11.40 క్వింటాళ్లను అమ్మకానికి సిద్ధం చేశారు. ఇక పెసర ఎంజీజీ 295 రకం 657.60 క్వింటాళ్లు, ఎంజీజీ–347 రకం 239.20 క్వింటాళ్లు, ఎంజీజీ 351 రకం 25.48 క్వింటాళ్లు, ఎంజీజీ–385 రకం 186.32 క్వింటాళ్లు, మినుములు పీయూ–31 రకం 21.16 క్వింటాళ్లు, టీబీజీ–104 రకం 30.80 క్వింటాళ్లు, జీబీజీ–1 రకం 15.04 క్వింటాళ్లు, కంది ఐసీపీఎల్–87119 రకం 261.16 క్వింటాళ్లు, మొక్కజొన్న డీహెచ్‌ఎం 117 రకం 0.15 క్వింటాళ్లు, వేరుశనగ గిరినార్–5 రకం 15 క్వింటాళ్లను విక్రయిస్తారు.

### వరి, పెసర, మినుము విత్తనాలకు బైబ్యాక్ విధానం

వరి, పెసర, మినుము పంటల్లో పలు రకాల విత్తనాలను ఉత్పత్తి చేసేందుకు కూడా రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఖమ్మం యూనిట్‌కు అవకాశం కల్పించింది. పంటల సాగుకు అనువైన నేలలు, నీటి వనరులను దృష్టిలో పెట్టుకొని విత్తనోత్పత్తికి రైతులకు ఈ అవకాశం ఇచ్చారు. వరిలో పీకేవీ హెచ్‌ఎంటీ 250 ఎకరాల్లో, బీపీటీ 5204 (సాంబమసూరి)ని 200 ఎకరాల్లో సాగు చేసేందుకు కూసుమంచి, రఘునాథపాలెం మండలాల్లో పలువురు రైతులకు విత్తనాలు అందజేస్తారు. ఇక పెసరలో ఎంజీజీ 295 రకం విత్తనోత్పత్తికి తిరుమలాయపాలెం, చింతకాని, ఖమ్మం రూరల్ మండలాలను ఎంపిక చేశారు.

### సకాలంలో రైతుల చెంతకు విత్తనాలు



రైతులకు సకాలంలో విత్తనాలు అందేలా చర్యలు చేపట్టాం. ఇప్పటికే వివిధ ప్రాంతాలకు విత్తనాలను చేరుస్తున్నాం. సహకార సంఘాలు, ఆగ్రో రైతు సేవా కేంద్రాల ద్వారా విత్తనాల అమ్మకం జరుగుతుంది. విత్తన కొరత రాకుండా చూస్తూనే, వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు అవసరమైన మేరకు విత్తనాలను అందుబాటులో ఉంచుతాం.

–ఎస్.భీక్షం, ప్రాంతీయ మేనేజర్, విత్తనాభివృద్ధి సంస్థ, ఉమ్మడి ఖమ్మం జిల్లా

## అధ్యాపకురాలు అనితకు డాక్టరేట్


అనిత

నేలకొండపల్లి/పాల్వంచ: నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు పి.అనితకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. భౌతికశాస్త్రం అధ్యాపకురాలిగా విధులు నిర్వర్తిస్తున్న ఆమె ఓయూ ప్రొఫెసర్ డి.కరుణసాగర్ పర్యవేక్షణలో 'స్టడీస్ ఆన్‌లైట్ ఇంటెన్సిటీ డిస్ట్రిబ్యూషన్ ఎట్ ది ఫోకస్ అండ్ ఔటాఫ్ ఫోకస్ ప్లేన్స్ ఆఫ్ ఆప్టికల్ సిస్టమ్స్ విత్ కాంప్లెక్స్ పీపుల్స్ ఫంక్షన్' అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి గాను డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమెను డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలేటి పరంజ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ ఎన్.మాధవరావు, అధ్యాపకులతో పాటు పాల్వంచ కాలేజీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వై.చిన్నప్పయ్య తదితరులు అభినందించారు. కాగా, పాల్వంచకు చెందిన అనిత మాట్లాడుతూ తన తల్లిదండ్రులు అమృత – లాజర్, భర్త రాములు ప్రోత్సాహంతో డాక్టరేట్ సాధించగలిగానని తెలిపారు.

## అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కేకేఆర్ విద్యార్థి ప్రతిభ


గౌరవ్‌ను అభినందిస్తున్న పాఠశాల బాధ్యులు

సత్తుపల్లి: సత్తుపల్లిలోని డాక్టర్ కేకేఆర్ సీఏస్ఆర్ పాఠశాల విద్యార్థి అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలలో ప్రతిభ చాటాడు. పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న టి.విజ్వల్‌సాయి గౌరవ్ ఇటీవల ఖజకిస్తాన్ దేశంలో నిర్వహించిన పోటీల్లో బంగారు పతకం సాధించాడు. అండర్–12 సీనియర్ విభాగం కుమిటేలో ఆయన బంగారు పతకం సాధించగా, పాఠశాల డైరెక్టర్లు అవినాష్, సీహెచ్ హరీశ్ శనివారం అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సీహెచ్ శ్రీవైష్ణవి, బ్రాంచ్ ప్రిన్సిపాల్ సీపీఎస్ఆర్ చైతన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఖమ్మం ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

**మహబూబాబాద్ జిల్లా వాసి ప్రాణాలు నిలిపిన వైద్యులు**


కోలుకున్న కమలమ్మతో వైద్యులు, అధికారులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించి ఓ వృద్ధురాలి ప్రాణాలు నిలిపారు. పేగుకి రంధ్రం పడి, అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెకు శస్త్రచికిత్స నిర్వహించగా కోలుకుని శనివారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామానికి చెందిన పి.కమలమ్మ (80) కొన్నాళ్లుగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఇటీవల నొప్పి పెరగడంతో ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొచ్చేసరికి ఆమె అపస్మారక స్థితికి చేరడంతో హైదరాబాద్ తీసుకెళ్లాలని సూచించారు. అయితే, నిరుపేదలైన ఆమె కుటుంబీకులు గతనెల 21వ తేదీన ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడ పరీక్షించిన వైద్యులు ఆమె పేగుకు రంధ్రం ఉన్నట్లు గుర్తించగా, అప్పటికే గుండె కొట్టుకోవటం కూడా మందగించింది. దీంతో చికిత్స ప్రారంభించిన వైద్యులు ఆమె ఆరోగ్యం సాధారణ స్థితికి చేరాక పేగుకు ఆపరేషన్ చేశారు. వైద్యులు రెహమాన్ షరీఫ్, మసూద్ పాషా, కొత్తపల్లి అశోక్ ఆధ్వర్యాన శస్త్రచికిత్స చేయగా సిబ్బంది సుబ్బమ్మ, ఖాదర్, యుగంధర్ సహకరించారు. ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్స చేయగా వైద్యుల పర్యవేక్షణలో కమలమ్మ కోలుకోగా శనివారం డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా వైద్య బృందాన్ని మెడికల్ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్, ఆర్‌ఎంఓలు బి.శ్రీనివాసరావు, డాక్టర్ రాంబాబు అభినందించారు.

# కాపాడుకోవాలి.. నన్ను పైరును..

కామేపల్లి: పైరుకు ఆశించిన తెగుళ్ల నియంత్రణకు రైతులు క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తారు. వారంలో కనీసం రెండు సార్లు మందు పిచికారీ చేయాల్సి ఉండగా.. ఈ సమయంలో రైతులు పలువురు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో అస్వస్థతకు గురవుతుంటారు. ఒక్కోసారి ప్రాణాలకు కూడా ప్రమాదం వాటిల్లుతుంది. కానీ, కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన రైతు అనుమంచినేని లాలయ్య మాత్రం మిరప పంటకు మందు పిచికారీ చేసే సమయాన హెల్మెట్ ధరించడం కనిపించింది. అటు పంటకు రక్షణ కల్పిస్తూనే తన భద్రత కోసం హెల్మెట్ ధరించినట్లు ఆయన తెలిపారు.


హెల్మెట్ ధరించి మందు పిచికారీ చేస్తున్న రైతు

# బాలికల వసతి గృహంలో న్యాయమూర్తి తనిఖీ


వసతిగృహంలో సౌకర్యాలపై ఆరా తీస్తున్న భానుమతి

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం రైటర్‌బస్తీలోని బాలికల వసతి గృహాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె అక్కడి బాలికలతో మాట్లాడి భోజనం, వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. అలాగే, హాస్టల్ నిర్వాహకురాలు బి.సునీతను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వసతి గృహంలోని గదులు, తాగునీరు, ఆహారం సిద్ధం చేసేందుకు తీసుకొచ్చిన సరుకులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొత్తగూడెం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.నిరంజన్‌రావు, మెండు రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.